సాక్షి విశాఖపట్నం

సోమవారం ǀ 17 ǀ ఏప్రిల్ ǀ 2023



సేవాలయాలు
గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ప్రజలకు వరంగా మారింది. గ్రామాల్లో వారి సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. 8లో



429 ఆలయాల పనులు
ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించాలని, తద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 10లో



స్మార్ట్ పాఠాలు
బైజూస్ కంటెంట్ పాఠ్యాంశాల బోధనతో మెరుగైన ఫలితాలు కనిపిస్తోండటంతో.. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం మరింతగా విస్తరిస్తోంది. 10లో

విశాఖపట్నం
ఇఫ్తార్ (సోమ) సహర్ (మంగళ)
6:17 4:22
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

తిమ్మాపురంలో వెంకీ సందడి



అభిమానులతో హీరో వెంకటేష్

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో ఆదివారం సాయంత్రం హీరో విక్టరీ వెంకటేష్ సందడి చేశారు. ఉక్కు నగరంలో జరుగుతున్న సైంధవ్ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు. ఆదివారం తన రామానాయుడు స్టూడియోకు చేరుకుని కాసేపు గడిపారు. పర్యాటకులు వెంకటేష్‌ను చూసి ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం



నటులను సత్కరిస్తున్న బాదంగీర్ సాయి

సీతమ్మధార: ద్వారకానగర్ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలో ఆదివారం తెలుగు నాటక రంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలుగా ఎన్నో నాటికలు, నాటకాలు ప్రదర్శిస్తున్న కళాకారులు ఎం.శివజ్యోతి, వర్రే నాంచారయ్య, సీవీఆర్ మూర్తి, ఇప్పిలి ఆదినారాయణలను రంగసాయి నాటక సంఘ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎం.వి.సుబ్రహ్మణ్యం బృందం ప్రదర్శించిన లఘు నాటక కడుపుబ్బా నవ్వించింది. జాగ్రత్త నాటిక ఆలోచింపజేసింది. బాదంగీర్‌సాయి దంపతులను రంగస్థల నటులు ఘనంగా సత్కరించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రంగస్థల ప్రముఖులు చలసాని కృష్ణప్రసాద్, బొబ్బా ధవళేశ్వరరావు, కె.వి.ఎస్.డి ప్రసాద్, గెద్ద వరప్రసాద్, పి.శివప్రసాద్ పాల్గొన్నారు.

చందనోత్సవం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

సింహాచలం : చందనోత్సవంలో సాధారణ భక్తుల దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర సీపీ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సీపీ పరిశీలించారు. ఉచిత దర్శనం, రూ.300, రూ.1000, రూ.1500 టికెట్ల దర్శనం క్యూలు ఎక్కడెక్కడ నుంచి ప్రారంభమవుతాయో, ఎంతదూరం క్యూల్లో నడవాల్సి వస్తుందో పరిశీలన చేశారు. సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ఆయా ఏర్పాట్ల ప్రణాళికను సీపీకి వివరించారు. జనరల్ క్యూల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు పక్కా ఉండాలని అధికారులకు సూచించారు. అలాగే క్యూల్లో మంచినీరు, టాయిలెట్లు పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర డీసీపీ ఆనంద్‌రెడ్డి, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం సీఐ నరసింహరావు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఏడుగురు అరెస్ట్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసాలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 100 కిలోల గంజాయిని ఎయిర్‌పోర్టు పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. కరాసాలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న 7 గురు వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దుస్తుల వ్యాపారం చేస్తుంటామని ఇంటి యజమానికి చెప్పి.. ఇల్లు అద్దెకు తీసుకున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రోన్‌తో భవిత



- రండి.. డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ పొందుదాం
- ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఏయూ ఆహ్వానం
- శిక్షణ, నిర్వహణ, తయారీపై వర్సిటీలో కేంద్రం

డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి (ఫైల్)



డ్రోన్లపై పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు

సాక్షి, విశాఖపట్నం: ప్రస్తుత రోజుల్లో సందడంతా డ్రోన్లదే. వ్యవసాయం, పెళ్లిళ్లు, భూముల సర్వే, మందుల పంపిణీ, సినిమా షూటింగ్‌లు, యూట్యూబ్ వీడియోలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏరియల్ సర్వే.. ఇలా పలు సందర్భాల్లో డ్రోన్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సాంకేతికతో సాయంతో వీటికి దిశానిర్దేశం చేస్తే.. లక్ష్యాన్ని అందుకుంటాయి. అయితే వీటిని నడిపే మానవ వనరుల కొరత ఉంది. నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవడం, ఖర్చును తగ్గించుకునే విషయంలో ఇప్పుడు అందరి ఆలోచన డ్రోన్ టెక్నాలజీ.. ప్రస్తుతం డ్రోన్ల సేవలు విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థులను డ్రోన్ టెక్నాలజీలో సుశిక్షితులను చేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సన్నద్ధమైంది. ఇందులో పరిశోధనల కోసం డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం 2022లో డ్రోన్ అంకుర సంస్థల వృద్ధి 34.4 శాతంగా నమోదైంది. డ్రోన్ టెక్నాలజీ సంస్థల్లో పెట్టుబడులూ వెల్లువెత్తుతున్నాయి. డ్రోన్ సేవల మార్కెట్ విలువ దేశీయంగా రెండేళ్ల కిందట 13.04 కోట్ల డాలర్లుగా నమోదైంది. 2030 నాటికి ఇది 400 కోట్ల డాలర్లకు పురోగమిస్తుందని నిపుణులు అంచనా. **వివిధ రంగాలకు అవసరమైన డ్రోన్లు, వాటి విడిభాగాలను తయారు చేసుకోవడంలో** భారత్.. ఇంకా స్వయం సమృద్ధి సాధించలేదు. సరైన ప్రణాళికలు, ప్రోత్సాహం అందిస్తే స్టార్టప్ సంస్థల సహకారంతో దేశంలో తయారీ సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా సరికొత్తగా ఇన్నోవేషన్ సెంటర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీస్(ఐసీడీటీ) కేంద్రాన్ని ఏయూ ఏర్పాటు చేసింది.

యూనివర్సిటీల చరిత్రలో తొలిసారిగా..

డ్రోన్ టెక్నాలజీ పరిశోధలనలపై ఈ తరహా కేంద్రాన్ని ఇంత వరకూ ఏ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయలేదు. మొదటిసారిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏయూ ప్రాంగణంలోని హెలిప్యాడ్ గ్రౌండ్స్‌ను ఆనుకొని దీన్ని ప్రారంభించారు. డ్రోన్లకు సంబంధించిన పైలట్, అప్‌స్కిల్లింగ్, ట్రైనింగ్, అసెంబుల్, నూతన సాంకేతికత మొదలైన అన్ని అంశాల్లోనూ ఇక్కడ పరిశోధనలు జరగనున్నాయి. **డ్రోన్ల నిర్వహణ, తయారీ** అంశాలపై పరిశోధనలు **చేసే కేంద్రంగా** దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఏయూలో ఏ కోర్సు చదివే విద్యార్థులైనా ఇక్కడ అందించే కోర్సుల్లో చేరి తమ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పిస్తోంది. విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడానికి హెలీపాడ్ మైదానాన్ని వినియోగించనున్నారు. ఈ సెంటర్‌లో డ్రోన్ వినియోగం, డ్రోన్ టెక్నాలజీపై భవిష్యత్ పరిశోధనలు నిర్వహించేలా మరింత అభివృద్ధి చేసేందుకు ఏయూ ప్రణాళికలు సిద్ధం చేసింది.



అందుబాటులో వివిధ రకాల డ్రోన్లు

సర్టిఫికెట్ ప్రోగ్రాంగా అందిస్తున్నాం

దేశాన్ని డ్రోన్ల కేంద్రంగా మార్చాలని కేంద్రం, వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగం విస్తృతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి. అయితే వేగంగా విస్తరిస్తున్న భారతీయ డ్రోన్ పరిశ్రమకు నిపుణులైన మానవ వనరుల కొరత వేధిస్తోంది. దీన్ని అధిగమించేలా తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏయూలో ప్రారంభించాం. ఐసీడీటీను పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రోగ్రాం కూడా అందిస్తున్నాం. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఏయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులు కూడా ఈ శిక్షణలో చేరేందుకు అవకాశం కలిస్తున్నాం.

– ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, వీసీ, ఏయూ

‘ప్రైవేటు’లో ఉచిత విద్యకు విశేష స్పందన

- 1,490 మంది దరఖాస్తు
- నేటితో సచివాలయాల్లో పరిశీలన పూర్తి
- రేపు మొదటి విడత విద్యార్థుల జాబితా

విశాఖ విద్య: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు అనూహ్య స్పందన లభించింది. విశాఖ జిల్లా నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. విద్యార్థుల వివరాలతో ఎంపిక చేసుకున్న పాఠశాలల జాబితా ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచారు. వీటి వాస్తవికతను ధ్రువీకరించే క్రమంలో సచివాలయ స్థాయిలో శరవేగంగా పరిశీలన జరుగుతోంది. సోమవారం సాయంత్రానికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అర్హత గల విద్యార్థులకు స్కూళ్ల కేటాయింపులో భాగంగా తొలి విడత లాటరీ ఈ నెల 18న జరగనుంది. సీటు పొందిన విద్యార్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచేందుకు విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. లాటరీలో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 19 నుంచి 25 వరకు కేటాయించిన పాఠశాలలో ప్రవేశం పొందాలి. ఈ నెల 29న రెండో విడత లాటరీ నిర్వహించి, అర్హులైన విద్యార్థుల జాబితాను విద్యాశాఖాధికారులు వెల్లడిస్తారు. సీట్ల కేటాయింపులో పారదర్శకత కోసం ఈ మొత్తం ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించనున్నారు.

25 శాతం సీట్ల కేటాయింపు

విద్యాహక్కు చట్టం అమల్లో భాగంగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 1,490 మంది ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు 592 వరకు ఉన్నాయి. జిల్లా విద్యాశాఖలోని ఓ డివిజన్ స్థాయి అధికారి అండదండలతో కొన్ని పేరుమోసిన పాఠశాలల నిర్వాహకులు ఉచిత ప్రవేశాలకు నిరాకరిస్తూ.. వెబ్‌సైట్‌లో తమ స్కూళ్లను నమోదు చేయకుండా తాత్సారం చేశారు. దీన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడంతో డీఈవో



ఎల్.చంద్రకళ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని.. వెబ్‌సైట్‌లో అన్ని పాఠశాలలు ఉండేలా తగిన చర్యలు చేపట్టారు.

క్రేజ్ ఉన్న స్కూళ్లలోనూ ఉచితం

నగరంలోని పేరుమోసిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతి చదువుకు రూ.లక్ష వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. విశాఖ వ్యాలీ వంటి సీఈఎస్ఈ పాఠశాలలో అడ్మిషన్‌కు తీవ్రమైన పోటీనే ఉంది. నారాయణ, చైతన్య వంటి స్కూళ్లలో చదువులు పేద వర్గాలకు భారంగానే మారుతున్నాయి. ఇలాంటి స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంది. ఉచితంగానే చదువుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఫీజుల భారం లేకుండా అమ్మ ఒడి పథకం డబ్బులతోనే దర్జాగా చదువుకునే అవకాశం కల్పిస్తోంది. 2022–23లో విశాఖ జిల్లాలో కేవలం 114 మంది మాత్రమే ఉచిత విద్యను అందిపుచ్చుకోగా.. ఈ సారి భారీగానే దరఖాస్తులు చేసుకున్నారు.

మండలాల వారీగా దరఖాస్తులు

ఆనందపురం	13
భీమునిపట్నం	62
పద్మనాభం	22
పెందుర్తి	15
విశాఖ పట్నం అర్బన్	1,378

ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్ 14417
వెబ్‌సైట్ https://cse.ap.gov.in

నృసింహుడి చందనోత్సవానికి శ్రీకారం



తొలి చందనం చెక్కతో ఆలయ బేడా ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు



చందనాన్ని అరగదీస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

తొలివిడత చందనం అరగదీత ప్రారంభం

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ నెల 23న వైశాఖ శుద్ధ తదియ రోజు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం(నిజరూప దర్శనం) జరగనుంది. ఆ రోజు రాత్రి స్వామికి తొలి విడతగా మూడు మణుగుల (120 కిలోలు) పచ్చి చందనం సమకూర్చేందుకు ఈ అరగదీత కార్యక్రమాన్ని చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఉదయం 6.05 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు నిర్వహించారు. తొలుత బేడా మండపంలోని బాండాగారం వద్ద తొలి చందనం చెక్కను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు. అనంతరం ఆ చందనం చెక్కతో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య బేడా ప్రదక్షిణ చేశారు. అనంతరం నోటికి గంతలు కట్టుకుని శ్రీనివాసాచార్యులు తొలి చందనాన్ని అరగదీశారు. ఆలయ ప్రధానార్చకుడు–2 ఇరగవరపు రమణాచార్యులు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు చందనాన్ని అరగదీశారు. ఈ చందనాన్ని స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం 15 మంది నాలుగో తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించారు. అర్చకులు గిరి, పెద్దరాజు, కుమార్ పూజలు నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వంకాయల సాయినిర్మల, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, డిప్యూటీ ఈవో సుజాత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా ప్రధానార్చకుడి హోదాలో తొలిసారి తొలి చందనాన్ని అరగదీసే అవకాశం గొడవర్తి శ్రీనివాసాచార్యులకు దక్కింది. గడిచిన కొన్నేళ్లుగా తొలి చందనాన్ని ఆలయ ప్రధానార్చకులే తీస్తున్నారు. గతంలో ఇన్‌చార్జి ప్రధానార్చకుడిగా రెండుసార్లు తొలి చందనం అరగదీసిన శ్రీనివాసాచార్యులు ఈ సారి ప్రధానార్చకుడి హోదాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

టెన్త్ ‘స్పాట్’కు రెడీ

- జిల్లాకు 2.07లక్షల టైటిల్స్
- పేపర్లు దిద్దేందుకు 2,095 మంది ఉపాధ్యాయులు
- నిఘా నీడలో క్వీన్ మేరీ స్కూల్



క్వీన్ మేరీ స్కూల్

విశాఖ విద్య : పదో తరగతి స్పాట్ వాల్యూషన్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. పరీక్షలు ఈ నెల 18తో ముగియనుండగా, ఆ మరుసటి రోజునుంచే జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. విశాఖ నగరంలోని క్వీన్‌మేరీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు ఈసారి సుమారుగా 2.07 లక్షల టైటిల్స్(జవాబు పత్రాలు) వస్తాయని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 26 నాటికి మూల్యాంకనం ప్రక్రియ పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషన్ ఎస్. మురళీ మోహన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. స్పాట్ కేంద్రంగా ఎంపిక చేసిన క్వీన్ మేరీ పాఠశాలలోనే తమ సిబ్బందితో మకాం వేసి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

విధుల్లో 2,095 మంది ఉపాధ్యాయులు

మూల్యాంకనం విధులకు జిల్లాకు చెందిన 2,095 మంది ఉపాధ్యాయులను నియమించారు. వీరిలో 1,340 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 540 మంది స్పెషల్ అసిస్టెంట్స్, 215 మంది చీఫ్ ఎగ్జామినర్స్ ఉన్నారు. అనుకున్న గడువులోగా మూల్యాంకనం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డి. దేవానందరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూల్యాంకనం లేనందున, అవసరమైతే అక్కడి ఉపాధ్యాయులను సైతం విశాఖ జిల్లాలో వినియోగించుకోవాలని విద్యాశాఖాధికారులు భావిస్తున్నారు.

మూల్యాంకనంపై నిశిత పరిశీలన

జవాబు పత్రాల మూల్యాంకంపై విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్ ఒక్క రోజులో 40 జవాబు పత్రాలను మాత్రమే దిద్దాల్సి ఉంటుంది. మూల్యాంకనం వాస్తవికతను ధ్రువీకరించేలా అసిస్టెంట్ ఎగ్జామినర్ దిద్దిన ప్రతీ 60లో 20 జవాబు పత్రాలను చీఫ్ ఎగ్జామినర్ తప్పనిసరిగా పరిశీలించనున్నారు. అసిస్టెంట్ క్యాంప్ అధికారి, డిప్యూటీ క్యాంప్ అధికారిగా వ్యవహరించే వారు సైతం అసిస్టెంట్ ఎగ్జామినర్ దిద్దిన జవాబు పత్రాలపై నిశిత పరిశీలన చేసేలా విధి విధానాలు రూపొందించారు. పరీక్ష రాసిన విద్యార్థులకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతోనే ఇటువంటి ఏర్పాట్లు చేశామని దేవానందరెడ్డి తెలిపారు.



సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

క్వీన్ మేరీ స్కూల్లో పటిష్ట భద్రత

మూల్యాంకనం కేంద్రంగా ఎంపిక చేసిన క్వీన్ మేరీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ నెల 19 నుంచి 26 వరకు పాఠశాలలోని తరగతులను పోర్ట్‌బే, సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో గల భవనాల్లోకి తరలిస్తున్నట్లు హెచ్‌ఎం ధర్మేంద్ర రెడ్డి తెలిపారు. పాఠశాల ఎంట్రన్స్ మొదలుకొని, మూల్యాంకనం జరిగే అన్ని తరగతి గదుల్లో సీసీ కెమెరాలను అమర్చారు. వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి తరచూ పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

18న రిపోర్ట్ చేయాలి



పదో తరగతి మూల్యాంకనంకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రద్ధ తీసుకుంటున్నాం. విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులంతా ఈ నెల 18 సాయంత్రం నాటికి తప్పనిసరిగా క్వీన్ మేరీ స్కూల్‌లో రిపోర్ట్ చేయాలి.

– ఎస్. మురళీ మోహన్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, విశాఖ జిల్లా

మే రెండో వారంలో ఫలితాలు



మూల్యాంకనం సకాలంలో పూర్తయ్యేలా దృష్టి సారించాం. విద్యార్థులు చాయిస్‌కు మించి ప్రశ్నలకు జవాబులు రాసినట్లయితే, ఎక్కువ మార్కులు పొందిన వాటినే పరిగణలోకి తీసుకునేలా ఆదేశాలు ఇచ్చాం. ఏ ఒక్క విద్యార్థికీ నష్టం కలుగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మే రెండో వారంలో ఫలితాలు విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నాం.

– డి. దేవానందరెడ్డి, ఏపీ ప్రభుత్వ పరీక్షల రాష్ట్ర డైరెక్టర్

• ఎండల్లో చల్లచల్లగా..

భానుడు భగభగమంటున్నాడు. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. మధ్యాహ్నం సమయంలో నిప్పుల కొలిమితో పాటు ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జంతువులు సైతం అవస్థలు పడుతున్నాయి. ఎండ నుంచి ఉపశమనానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వేళ నగర ప్రజలు సాగరతీరానికి చేరుకుని సేద తీరారు.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్



జూపార్కులో సేదతీరుతున్న ఏనుగు



బీచ్‌లో జన సందోహం



బైక్‌పై కూలర్ తీసుకెళ్తున్న వాహనచోదకుడు

16 నెలల తర్వాత సొంత గూటికి..

- మతిస్థిమితం కోల్పోయిన మహిళ
- చికిత్స అందించి కుటుంబసభ్యుల చెంతకు చేర్చిన ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్



నిరాశ్రయ వసతి గృహంలో హాఫీజ్(ఫైల్)



కుటుంబ సభ్యులతో హాఫీజ్ (పత్రాలతో మహిళ)

అల్లిపురం: మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన ఓ మహిళ.. ఏయూటీడీ సంస్థ సహకారంతో 16 నెలల తర్వాత తిరిగి తన ఇంటికి చేరుకుంది. జార్ఖండ్ రాష్ట్రం, ధన్‌బాద్ జిల్లా, మిద్నాపూర్ గ్రామానికి చెందిన హాఫీజ్ అనే మహిళ ఇంట్లో సమస్యలతో మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో ఇంటి నుంచి తప్పిపోయిన ఆమె ఈ గత ఏడాది విశాఖ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ.. ఏయూటీడీ సిబ్బందికి కనిపించింది. వెంటనే వారు టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ వసతి గృహానికి తీసుకెళ్లారు. తర్వాత చినవాల్తేరులోని మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. దీంతో ఆమెకు తన గతం గుర్తుకొచ్చింది. తన ఊరు, కుటుంబం వివరాలను ఏయూటీడీ సిబ్బందికి తెలియజేసింది. మనోబంధు కార్యక్రమంలో భాగంగా పుణేకు చెందిన శ్రద్ధా ఫౌండేషన్‌కు ఈ వివరాలు తెలియజేయడంతో.. వారు ఆమె కుటుంబాన్ని గుర్తించారు. ఈ నెల 15న ఆమెను తన భర్తకు అప్పగించారు. ఇన్నాళ్లు ఏమైపోయిందో అన్న ఆమె తిరిగి రావడంతో కుటుంబ సభ్యులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి దుర్మరణం





మృతి చెందిన జీవన్ కుమార్

పద్మనాభం: మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చి ఆ విద్యార్థిని కబళించింది. అతనికి 16 ఏళ్లకే నూరేళ్లు నిండిపోయాయి. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు అందించిన వివరాలివీ.. పాండ్రంగికి చెందిన పాండ్రంగి జీవన్‌కుమార్(16) ఆదివారం ఆనందపురంలో ఉన్న తన మేనత్త సింగిడి వెంకటలక్ష్మి ఇంటికి వెళ్లడానికి పాండ్రంగి నుంచి బోని వరకు నడుచుకుంటూ వచ్చాడు. పద్మనాభం గ్రామానికి చెందిన తవిటిన భార్గవ్ పద్మనాభం నుంచి స్కూటీపై ఆనందపురం వెళుతున్నాడు. బోని జంక్షన్‌లో జీవన్ కుమార్‌కు ఆయన లిఫ్ట్ ఇచ్చాడు. వీరిద్దరూ ఆనందపురం వెళుతుండగా మార్గమధ్యలో పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం వద్ద పొలం నుంచి రోడ్డు మీదకు వస్తున్న ట్రాక్టర్ స్కూటీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో జీవన్, భార్గవ్‌కు తల మీద బలమైన గాయాలయ్యాయి. వీరిలో జీవన్ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. భార్గవ్‌ను సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. డ్రైవర్ వెన్ని రామును అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

పరీక్షలు ముగిసిన తర్వాత రోజే..

పాండ్రంగి వెంకట అప్పారావు, సావిత్రిలకు కుమారుడు జీవన్ కుమార్, కుమార్తె(15) ఉన్నారు. జీవన్ ఆనందపురం బీసీ వసతి గృహంలో ఉంటూ 10వ తరగతి చదువుతున్నాడు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియడంతో.. వసతిగృహం నుంచి శనివారం ఇంటికి వచ్చాడు. తిరిగి ఆనందపురంలో ఉన్న మేనత్త సింగిడి వెంకట లక్ష్మి ఇంటికి ఆదివారం వెళుతున్నాడు. మార్గంమధ్యలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వీరిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. తల్లి సావిత్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇంటి వద్దే ఉంది. తండ్రి వెంకట అప్పారావు చేపల వేటకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడు జీవన్ ప్రయోజకుడై కుటుంబాన్ని ఆదుకుంటాడని ఆశపడ్డారు. మృత్యువు ట్రాక్టర్ రూపంలో అతన్ని కబళించుకుపోవడంతో వీరి ఆశలు అడియాశలయ్యాయి. వీరికి సొంత ఇల్లు లేక శిథిలమైన పాఠశాల భవనంలో తలదాచుకుంటున్నారు.

సేవాలయాలు

- ప్రజలకు చేరువవుతున్న సచివాలయాలు
- ప్రతి రోజూ గ్రీవెన్స్
- 9,86,362 వినతులు రాగా.. 9,11,858 పరిష్కారం
- ఇప్పటి వరకూ 2,96,054 సేవలందించిన సచివాలయాలు
- ఆధార్ సేవలతో ప్రజలకు చేరువైన సిబ్బంది
- 65,613 మందికి ఆధార్ సేవలు పూర్తి



గ్రీవెన్స్ అందించేందుకు వచ్చిన ప్రజలతో కిటకిటలాడుతున్న సచివాలయం

సాక్షి, విశాఖపట్నం : గతంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిజం చేశారు. ప్రజలకు పాలన మరింత చేరువ చేస్తూ సేవలన్నింటినీ వారి చెంతకే తీసుకొచ్చారు. ప్రజలకు 544 ప్రభుత్వ సేవలను అందించే కార్యక్రమంతో ప్రతి సమస్య కూడా సచివాలయ సిబ్బంది పరిష్కరించడంలో ముఖ్యభూమిక పోషిస్తున్నారు. మరోవైపు దేశంలో కీలకమైన ఆధార్ సేవలు కూడా సచివాలయాల్లో అందుబాటులోకి రావడంతో ప్రజలకు కష్టాలన్నీ తొలగిపోయాయి. విభిన్న సేవలందిస్తున్న సచివాలయాలు సేవాలయాలుగా మారాయి.

జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాలున్నాయి. ఇందులో మొత్తం 607 సచివాలయాలుండగా వార్డు సచివాలయాలు 545 ఉన్నాయి. గ్రామ సచివాలయాలు 62 వరకూ ఉన్నాయి. వార్డులు, గ్రామాల్లో నివసించే రైతు నుంచి కూలీ వరకు అన్ని వర్గాలకు అవసరమైన సేవలను నిర్ణీత కాల వ్యవధిలో అందిస్తున్నాయి. ఎవరి సిఫార్సులు లేకుండా, రాజకీయ జోక్యం లేకుండా, పైసా లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా ఉన్న ఊరు, వార్డుల్లోనే ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జనన ధ్రువీకరణపత్రం నుంచి బియ్యం కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్ కార్డు, ఇంటి స్థలం పట్టా, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రైతులకు అవసరమైన భూ రికార్డులు, విద్యుత్, మంచినీటి కనెక్షన్ వంటి మొత్తం 544 సేవలను నిర్ణీత గడువులోగా ప్రజలకు అందిస్తున్నారు. గతంలో ప్రభుత్వ సేవలతో పాటు రేషన్ కార్డు కావాలన్నా, పెన్షన్ కావాలన్నా మండల, డివిజన్, జిల్లా కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేసినా మంజూరయ్యేవి కావు. పైగా లంచాలు ఇచ్చిన వారికి, పలుకుబడి ఉన్న వారికే అరకొర మంజూరయ్యేవి. ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా సేవలు అందుతున్నాయి.

ప్రతి రోజూ గ్రీవెన్స్

ప్రతి సచివాలయ పరిధిలోనూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అన్ని సచివాలయాల్లోనూ రోజూ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయ పరిధిలో ఉన్న ప్రజలు తమ సమస్యలను సిబ్బంది దృష్టికి తీసుకునే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా విభిన్న రకాల సేవలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలంటూ స్థానిక ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను కూడా సచివాలయ ఉద్యోగులే తీసుకున్నారు. ప్రతి ప్రాంతంలోనూ అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. ఇప్పటి వరకూ గ్రీవెన్స్ ద్వారా 9,86,362 వినతులు రాగా ఇందులో 9,11,858 వినతులను పరిష్కరించారు. 51,025 అర్జీలను తిరస్కరించారు. మరో 23,479 వినతులు పరిశీలనలో ఉన్నాయి.

పెరుగుతున్న సేవలు

ఒక్కో సచివాలయంలో ప్రజల కోసం 544 సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఆరు నెలల క్రితం సేవలందించే విషయంలో జిల్లాలోని సచివాలయాలు కాస్తా వెనుకంజలో ఉన్నాయి. కలెక్టర్ డా.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి.. సేవలందించే విషయంలో దూకుడు ప్రదర్శించాలని సూచించారు. అప్పటి నుంచి జిల్లా సచివాలయాలు గేరు మార్చాయి. ఏపీ సేవా సర్వీసులను జిల్లా సచివాలయాలు ఇప్పటి వరకూ మొత్తం 2,96,054 వరకూ అందించి టాప్-5లోకి దూసుకెళ్లాయి. కోడి పందేలావీధిలోని వార్డు సచివాలయంలో నెలరోజుల్లో 1000 ఏపీ సేవలందించడం గమనార్హం. అదేవిధంగా ఆధార్ సేవలందించే విషయంలోనూ జిల్లా సచివాలయాలు జోరు పెంచాయి. ఇప్పటి వరకూ రికార్డు స్థాయిలో 65,613 మందికి ఆధార్ సేవలను అందించడం విశేషం. ఆధార్ అప్‌డేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం ప్రజలను ఇబ్బందుల నుంచి దూరం చేసింది. గ్రామ, వార్డు స్థాయిల్లో ఉన్న సచివాలయాల్లోనే ఆధార్ సేవలను ప్రారంభించడంతో దూర ప్రాంతాలకు వెళ్లే శ్రమ తప్పి స్థానికంగానే ఆధార్ సేవలు అందుతుండడంతో ప్రజలు ఊరట చెందుతున్నారు.

సచివాలయాల పరిధిలో పరిష్కరించిన కొన్ని విభాగాల వినతుల వివరాలివీ

డిపార్ట్‌మెంట్	వచ్చిన వినతులు	పరిష్కరించినవి	తిరస్కరించినవి
పౌరసరఫరాలు	33,944	21,293	10,090
రెవిన్యూ	4,01,027	3,55,728	27,023
ఆధార్	65,613	65,613	00
బిల్ పేమెంట్‌సర్వీసు	2,78,776	2,78,776	00
ఈపీడీసీఎల్	17,123	16,834	280
వైద్య,కుటుంబ సంక్షేమం	15,048	15,038	09
కార్మిక శాఖ	16,580	16,580	00
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్	70,900	56,968	12,569
పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి	20,508	19,608	453

నాణ్యమైన, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు



గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ఉన్న ప్రాంతంలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలందుతున్నాయి. ప్రతి సేవకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్దిష్ట గడువు విధించారు. గడువులోగా సేవలు, వినతులు పరిష్కృతమవ్వాలని కలెక్టర్ ఆదేశించిన మేరకు సచివాలయాల్లో సేవలు వేగవంతం చేశాం. సచివాలయాలకు వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు కలెక్టర్, జేసీ, డీఆర్వో నిరంతరం సలహాలు, సూచనలందిస్తున్నారు. దానికి అనుగుణంగా సచివాలయ ఉద్యోగులను ఎప్పటికప్పుడు మానటరింగ్ చేస్తూ ప్రజలకు కూడా సెక్రటేరియట్స్‌లో అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన విస్తృతం చేశాం. ఇప్పుడు మంచి ఫలితాలు వస్తున్నాయి.

– పూర్ణిమాదేవి, డీఎల్‌డీవో, విశాఖపట్నం

నవ్వుల్లో ముంచెత్తిన ‘ఆశువుగా హాస్యం’



ఆశువుగా జోకులు చెబుతున్న కామెడీ జోడి వేముల భాస్కరాచారి, పెసల కనకదుర్గాప్రసాద్

సీతంపేట : ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో జోకులు చెప్పి సుతిమెత్తని హాస్యంతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. క్రియేటివ్ కామెడీ క్లబ్, హాస్యప్రియా కామెడీ క్లబ్ సంయుక్త నిర్వహణలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధనకు 12 గంటల నిర్విరామ ‘ఆశువుగా హాస్యం’ కార్యక్రమం నిర్వహించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కామెడీ జోడి వేముల భాస్కరాచారి, పెసల కనకదుర్గాప్రసాద్ 120కి పైగా విభిన్న అంశాలపై ప్రేక్షకులు అడిగిన సిట్యువేషన్‌పై ఆశువుగా అప్పటికప్పుడు జోకులు చెప్పి కడుపుబ్బా నవ్వించారు. సభా మర్యాదలు, ఉపన్యాసాలు, దేవుడు ఆధ్యాత్మికత, స్నేహితులు, పుస్తకాలు, అలవాట్లు, కుటుంబ వ్యవహారాలు, ఊబకాయం, టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, వంటా వార్పు, భోజనాలు, రియల్ ఎస్టేట్, భార్యాభర్తలు వంటి పలు అంశాలపై హాస్యం పండించారు. ఆదివారం ఉదయం 6.50 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం 6.50 గంటల వరకు జరిగింది. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధనకు కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, కళాకారులు మేడా మస్తాన్‌రెడ్డి, టి.ఎల్.ప్రసాద్, ఇమంది ఈశ్వరరావు, ఎస్.ఎస్.ఆర్.కృష్ణారావు, ఫణిస్వామి, డి.ఆర్.కె.రావు, కోరుకొండ రంగారావు, పలువురు హాస్య కళాకారులు, హాస్య ప్రియులు పాల్గొన్నారు.

3 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: విశాఖలో ఆదివారం మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. గత కొద్ది రోజులుగా కేసులు పెరుగుతున్నాయి గడిచిన 24 గంటల్లో 139 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 43కి చేరింది. 40 మంది హోం ఐసోలేషన్‌లో ఉండగా, ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

సాగరతీరంలో ఘనంగా ఇఫ్తార్ విందు



సాగరతీరంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. అంబూసరంగ్ మసీద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ముందుగా మత పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

‘సాక్షి’ స్పోర్ట్స్ జర్నలిస్ట్‌కు సత్కారం



ప్రకాశ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ది ఒలింపిక్ సంఘం ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ‘సాక్షి’ దినపత్రిక స్పోర్ట్స్ జర్నలిస్ట్ డాక్టర్ ఎం.ఎ.ఎస్ ప్రకాశరావును బెస్ట్ స్పోర్ట్స్ జర్నలిస్ట్‌గా ది ఒలింపిక్ సంఘం ఎంపిక చేసి ఘనంగా సత్కరించింది. రాంనగర్ లయన్స్ క్లబ్‌లో ఆదివారం సంఘం సర్వ సభ్య సమావేశం జరిగింది. ఒలింపిక్ క్రీడల బెస్ట్ ప్లేయర్స్ గా ధనుష్‌కుమార్, ఎర్రాజీ జ్యోతి, నాన్ ఒలింపిక్ క్రీడల బెస్ట్ ప్లేయర్స్‌గా బి.ప్రశాంత్, ఆర్.పూర్ణలను ఎంపిక చేశారు. బెస్ట్ పీఈటీగా నూకరాజు, బెస్ట్ కోచ్‌గా గణపతి, బెస్ట్ స్పోర్ట్స్ జర్నలిస్ట్‌లుగా డాక్టర్ ప్రకాశ్, రమణలకు జ్ఞాపికలందచేశారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్ నాయుడు చీఫ్ పాట్రన్‌గా, టి.ఎస్.ఆర్ ప్రసాద్ చైర్మన్‌గా, ఎంపీ మాణిక్యాలు వైస్ చైర్మన్‌గా నామినేట్ అయ్యారు. అధ్యక్షుడిగా డి.ప్రసన్నకుమార్, కార్యదర్శిగా కె.సూర్యనారాయణ, కోశాధికారిగా ఎ.మోహన్‌వెంకటరామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అచ్యుతరెడ్డి, వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా నీలంశెట్టి లక్ష్మి, అప్పలరాజు, కమిటీ సభ్యులుగా ప్రసాదరాజు, శరత్‌దొర, శర్మ, రాజేశ్వరి, చిన్నబాబు, ఆశ్రిత వ్యవహరించనున్నారు.

చెస్ జట్టుకు రుత్విక్, యమున



ఓపెన్‌లో రుత్విక్‌తో ఉమామహేశ్వరరావు పోటీ



వుమెన్ తుదిరౌండ్‌లో రుహికతో యమున పోటీ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా ఓపెన్, వుమెన్ చదరంగం జట్ల ఎంపికలో రుత్విక్, యమున సత్తా చాటారు. ఓపెన్‌లో ఏడు రౌండ్లు, మహిళలకు ఐదు రౌండ్ల పోటీలు నిర్వహించగా 99 మంది పోటీపడ్డారు. ఓపెన్‌లో 1807 ఫిడే రేటెడ్ వెంకటరుత్విక్ ఆరున్నరపాయింట్లతో నిలవగా వంశీకృష్ణ(1385), వెంకటేష్(1111), సంతోష్ కృష్ణ(1183) ఆరేసి పాయింట్లతో నిలిచి జట్టుకు ఎంపికయ్యారు. ఓపెన్‌లో 15 మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లు జిల్లా జట్టులో స్థానం కోసం ఎత్తుకు పైఎత్తులు వేశారు. ఓపెన్ ఫైనల్ రౌండ్‌లో ఉమామహేశ్వరరావు(1199)పై రుత్విక్ విజయం సాధించి ఆధిక్యం సాధించాడు. టోర్నీలో రెండో సీడ్ లోకేష్(1568)తో వంశీకృష్ణ డ్రా చేసుకోగా.. సయిద్(1055)పై సంతోష్, అన్‌రేటెడ్ వైభవ్‌పై వెంకటేష్ విజయం సాధించి జిల్లా జట్టులో స్థానం పొందారు. వుమెన్‌లో 1083 ఫిడే రేటెడ్ యమున ఐదు పాయింట్లతో నిలవగా బాంధవిక, యామిని నాలుగేసి పాయింట్లతోనూ, రూహికవిద్యాన మూడున్నర పాయింట్లతోనూ జట్టుకు ఎంపికయ్యారు. వుమెన్ ఫైనల్ రౌండ్‌లో రుహికపై యమున విజయం సాధించగా.. విష్ణుప్రియపై బాంధవిక, మనస్విపై యామిని విజయం సాధించి జిల్లా జట్టుకు అర్హత సాధించారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి విద్యా మందిర్‌లో ఈ పోటీలు ఆదివారం జరిగాయి.

శారదాపీఠంలో ప్రముఖులు





స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న నగర సీపీ త్రివిక్రమ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సీఎండీ సజ్జనార్

సింహాచలం: శారదాపీఠాన్ని ఆదివారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ సందర్శించారు. రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర ఆశీస్సులు తీసుకున్నారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సీపీని శాలువాతో సత్కరించి, రాజశ్యామల అమ్మవారి విగ్రహం అందజేశారు. అలాగే తెలంగాణ ఆర్టీసీ సీఎండీ వీసీ సజ్జనార్ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. పీఠాధిపతులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తున్నారు. తొలిసారిగా విశాఖ శారదాపీఠాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్‌కు రాజశ్యామల అమ్మవారి ప్రతిమను స్వరూపానందేంద్ర సరస్వతి అందజేశారు.

ఉత్తమ నాటికగా కొత్త పరిమళం

ముగిసిన పైడా కౌశిక్ నాటిక పోటీలు



ఉత్తమ నాటికగా ఎంపికైన కొత్త పరిమళం బృందానికి జ్ఞాపిక అందిస్తున్న వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు, నిర్వాహకులు పైడా కృష్ణప్రసాద్

మద్దిలపాలెం: దేశ సరిహద్దుల్లో జీవన గమనంపై కళ్ల కట్టినట్టు దృశ్యావిష్కరణ చేసి.. ప్రేక్షకుల హృదయాలను కదిలించిన ‘కొత్త పరిమళం’నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటిక పలు బహుమతులను కైవసం చేసుకుంది. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్రస్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు పలు నాటికలు ప్రదర్శించగా.. విజేతలను ప్రకటించారు. ‘కొత్త పరిమళం’తో హద్దులు, సరిహద్దుల్లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటికకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేషాలను నటీనటులు అద్భుతంగా ప్రదర్శించగా.. అద్భుతమైన సెట్టింగ్‌లు, వెండితెరను మరిపించేలా ఆహార్యం పోటీలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ నాటికకు దర్శకత్వం వహించిన బి.ఎం.ఎస్ పట్నాయక్ ఉత్తమ దర్శకుడిగా, ఉస్మాన్‌ఖాన్ పాత్ర పోషించిన బి.చలం ఉత్తమ ప్రతినాయకుడిగా ఎంపికయ్యారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఏలూరుకు చెందిన హేళాపురి కల్చరల్ అసోసియేషన్ వారి మనసున మనస్సై, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు చెందిన అమృత థియేటర్స్ ఆర్ట్స్ వారి నాన్నా నేనొచ్చేస్తా ఎంపికయ్యాయి. ఉషోదయ కళానికేతన్ వారి ప్రక్షాళన నాటిక నాలుగో స్థానాన్ని కై వసం చేసుకుంది. జ్యూరీ ప్రదర్శనలుగా వెండి అంచులు, అనుకొని అతిథి, ప్రక్షాళన నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ రంగాలంకరణ మనసున మనస్సైకు, ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా ప్రయాణం నాటికలో బసవరాజు జయశంకర్‌కు, ఉత్తమ సహాయ నటుడిగా మనసు మనస్సై నాటికలో రబానీ పాత్రధారి ఎస్.శ్రీనివాసరావుకు, ఉత్తమ సంగీతంగా అభియన ఆర్ట్స్ వారి చందమామరావేకు లభించాయి. వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, నిర్వాహకులు పైడా కృష్ణ ప్రసాద్‌ల చేతులమీదుగా విజేతలకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

చివరి ప్రదర్శనగా నాన్నా నేనొచ్చేస్తా..

పైడా కౌశిక్ నాటిక పోటీల్లో భాగంగా చివరి ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ నాన్నా నేనొచ్చేస్తా..ను ప్రదర్శించారు. నాటికలో నటీనటులు అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకుల మన్ననలు పొందారు.

79 ఏళ్ల రావిప్రోలుకు ఏయూ డాక్టరేట్



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న సుబ్రహ్మణ్యం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం పరిశోధక విద్యార్థి రావిప్రోలు సుబ్రహ్మణ్యంకు ఏయూ డాక్టరేట్ లభించింది. ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య ఎ.బి.ఎస్.వి రంగారావుల సంయుక్త పర్యవేక్షణలో ‘ఏయూ విద్యార్థుల్లో మహాత్మా గాంధీపై అవగాహన’ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి శనివారం డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. గాంధీపై ప్రత్యేకంగా ప్రశ్నావళిని రూపొందించి.. వర్సిటీలో చదువుకుంటున్న 365 మంది విద్యార్థుల నుంచి సమాచారాన్ని రాబట్టారు. మహాత్ముడిపై ఇష్టంతో వెయ్యికిపైగా పుస్తకాలను సేకరించారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్‌లో చీఫ్ కెమిస్ట్‌గా పనిచేసి 2003లో పదవీ విరమణ చేసిన అనంతరం రావిప్రోలు ఎంఏ గాంధీయన్ స్టడీస్ కోర్సును మధురై కామరాజ్ వర్సిటీలో పూర్తి చేశారు. నెల్లూరు జిల్లా పల్లెపాడులోని పినాకిని సత్యాగ్రహ(గాంధీ) ఆశ్రమం ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పనిచేశారు.